సాక్షి నిర్మల్

మంగళవారం ; 13 ; ఆగస్టు ; 2024



లెఫ్టా.. రైటే! 8లో▸

జన్యు ప్రభావంతో ప్రతీ వందలో పది మంది ఎడమచేతి వాటం కలిగి ఉంటారని వైద్య పరిశోధనల్లో రుజువైంది. నేడు లెఫ్ట్ హ్యాండర్స్ డే సందర్భంగా ప్రత్యేక కథనం..



నడకతో ఆరోగ్యం 9లో▸

మానవ శరీరానికి దివ్యమైన ఔషధం నడక ఒక్కటే. నిత్యం గంటపాటు నడిస్తే ఆరోగ్యానికి మంచిదని వైద్యులు సూచిస్తున్నారు.

గరిష్టం/కనిష్టం
32.0 /26.0

వాతావరణం

సాధారణ ఉష్ణోగ్రతలు నమోదవుతాయి. ఆకాశం పూర్తిగా మేఘావృతమవుతుంది. అక్కడక్కడా జల్లులు కురిసే అవకాశముంది.

న్యూస్‌రీల్

విద్యార్థులు క్రీడల్లో రాణించాలి



విద్యార్థులకు బహుమతులు ప్రదానం చేస్తున్న అదనపు కలెక్టర్ ఫైజన్ అహ్మద్

నిర్మల్‌టౌన్: విద్యార్థులు చదువుతోపాటు క్రీడల్లో రాణించాలని అదనపు కలెక్టర్ ఫైజాన్ అహ్మద్ సూచించారు. గత నెల 30న క్రీడల శాఖ ఆధ్వర్యంలో ఆన్‌లైన్‌లో జిల్లాస్థాయి 'ఒలింపిక్స్‌లో భారతదేశం' అంశంపై క్విజ్ పోటీలు నిర్వహించగా, ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు కలెక్టరేట్‌లో సోమవారం అదనపు కలెక్టర్ బహుమతులు ప్రదానం చేశారు. దిలావర్‌పూర్ జిల్లా పరిషత్ పాఠశాలకు చెందిన రాథోడ్ ఈశ్వర్, ఏ సుజాల ప్రథమ, ద్వితీయ స్థానాలు, మస్కాపూర్ పాఠశాలకు చెందిన దీక్షిత తృతీయ స్థానంలో నిలిచి బహుమతులు అందుకున్నారు. జిల్లా క్రీడలశాఖ అధికారి శ్రీనివాస్, పీడీ అంబాజీ తదితరులు పాల్గొన్నారు.

భారీ వాహనంతో జిల్లా కేంద్రంలో ట్రాఫిక్ జామ్



భారీ వాహనం వెనుక నిలిచిన ట్రాఫిక్

నిర్మల్‌టౌన్: జిల్లా కేంద్రంలో మంచిర్యాల-భైంసా ప్రధాన రహదారిపైకి సోమవారం హర్యానా నుంచి ముంబై వెళ్తున్న భారీ కంటైనర్ రావడంతో ట్రాఫిక్ స్తంభించిపోయింది. పట్టణంలోని కొండాపూర్ చౌరస్తా నుంచి నిర్మల్ వైపుగా పరిమితికి మించి ఈ భారీ వాహనం రోడ్డుపైకి వచ్చింది. దీంతో గంటల తరబడి మిగతా వాహనాలు రోడ్డుపై నిలిచిపోయాయి. వాహనచోదకులు, ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారు. ఇలాంటి భారీ వాహనాలను పట్టణంలోకి డే టైం లో అనుమతి ఇవ్వద్దని వారు కోరుతున్నారు.

ఆలయంలో 'శ్రావణ' పూజలు



ఆలయంలో పూజలు చేస్తున్న భక్తులు

దిలావర్‌పూర్: మండలంలోని కదలి మాతాన్నపూర్ణ పాపహరేశ్వరాలయంలో శ్రావణ మాస ప్రత్యేక పూజలు వైభవోపేతంగా కొనసాగుతున్నాయి. సోమవారం ఆలయంలో స్వామివారికి అర్చకులు ప్రత్యేక అభిషేక పూజలు నిర్వహించారు. అనంతరం భక్తులను దర్శనానికి అనుమతించారు. రెండో శ్రావణ సోమవారం కావడంతో భక్తులు అధికసంఖ్యలో వచ్చి పూజలు చేసి మొక్కు తీర్చుకున్నారు. భక్తులకు ఇబ్బందులు రాకుండా ఆలయ కమిటీ చైర్మన్ నార్వాడి వెంకట్రావు, సభ్యులు అన్ని ఏర్పాట్లు చేశారు. భక్తుల కోసం ఆలయ ప్రాంగణంలో నిత్యాన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు.

ప్రజాసమస్యలు పరిష్కరించాలి

నిర్మల్‌టౌన్: ప్రతీ కార్యకర్త ప్రజలతో ఉంటూ సమస్యలు పరిష్కరించడంలో ముందుండాలని సీపీఐ రాష్ట్ర కౌన్సిల్ సభ్యుడు శంకర్ సూచించారు. సోమవారం జిల్లా కేంద్రంలోని పెన్షనర్స్ భవనంలో పార్టీ కార్యవర్గ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా శంకర్ మాట్లాడుతూ.. కేంద్రంలో బీజేపీ సర్కార్ పేదలు, కార్మికుల హక్కులు కాలరాస్తోందని ఆరోపించారు. రైతులకు కనీస మద్దతు ధర లేక నష్టపోతుంటే కార్పొరేట్లకు రాయితీలు ప్రకటిస్తోందని విమర్శించారు. అనంతరం నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. నాయకులు ఎస్ఎన్ రెడ్డి, ఉపాలి తదితరులున్నారు.

సబ్ రిజిస్ట్రార్‌గా స్వామిదాస్ బాధ్యతల స్వీకరణ



స్వామిదాస్

ఖానాపూర్: పట్టణంలోని రిజిస్ట్రేషన్ కార్యాలయంలో సబ్ రిజిస్ట్రార్‌గా స్వామిదాస్ సోమవారం బాధ్యతలు స్వీకరించారు. ఇదివరకు విధులు నిర్వహించిన సబ్ రిజిస్ట్రార్ ఇమ్రాన్‌ఖాన్ బదిలీపై వెళ్లడంతో ఆయన స్థానంలో ఇన్‌చార్జి సబ్ రిజిస్ట్రార్‌గా జూనియర్ అసిస్టెంట్ కపిల్ బాధ్యతలు నిర్వర్తించారు. సోమవారం నిజామాబాద్ నుంచి బదిలీపై వచ్చిన స్వామిదాస్ బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా అధికారులు, సిబ్బంది స్వాగతం పలికారు.



పొన్కల్ మండలం కోసం ర్యాలీ తీస్తున్న జేఏసీ నాయకులు(ఫైల్)

మండలాల సంగతేంది?

- జిల్లాలో నాలుగు కొత్త పంచాయతీలు
- మరి కొన్నింటినీ చేయాలని డిమాండ్
- మళ్లీ తెరపైకి కొత్త మండలాల అంశం
- ఇప్పటికే పొన్కల్‌కు నోటిఫికేషన్ జారీ
- సర్కారు మారడంతో నిలిచిన ప్రక్రియ

నిర్మల్: పంచాయతీ సమరానికి సర్కారు సన్నద్ధమవుతోంది. ఇటీవల నాలుగు కొత్త పంచాయతీలను ఏర్పాటు చేస్తూ గెజిట్ ఉత్తర్వులు జారీ చేసింది. ఓటరు జాబితా తయారీకి సంబంధించి సిబ్బందికి శిక్షణ కూడా ఇచ్చింది. ఈ నేపథ్యంలో కొన్నేళ్లుగా డిమాండ్‌లో ఉన్న కొత్త మండలాల అంశం కూడా ముందుకు పడుతుందన్న ఆశలు రేకెత్తుతున్నాయి. జిల్లాలో అసెంబ్లీ ఎన్నికలకు ముందే పొన్కల్ మండల ఏర్పాటుకు సంబంధించి ప్రభుత్వం ప్రాథమిక నోటిఫికేషన్ జారీ చేసింది. కానీ, ఎన్నికల తర్వాత పరిణామాలు మారిపోవడంతో ఈ ప్రక్రియ ముందుకు సాగలేదు. మిగతా మండలాల ఏర్పాటుపైనా ఎలాంటి కదలిక లేకుండా పోయింది.

400కు చేరిన పంచాయతీలు

జిల్లాలో గ్రామపంచాయతీల సంఖ్య 400కు చేరింది. మొత్తం 19మండలాలు ఉండగా, ఇందులో నిర్మల్ అర్బన్ మినహా మిగతా 18మండలాల్లో ఇదివరకు 396 గ్రామపంచాయతీలుండేవి. ఇటీవల మరో నాలుగు కొత్త పంచాయతీలను ఏర్పాటు చేస్తూ గెజిట్ జారీ చేశారు. దీంతో జిల్లాలో మొత్తం పంచాయతీల సంఖ్య 400కు చేరింది. కుభీర్ మండలంలోని రంజని పంచాయతీ పరిధి రంజని తండా, తానూరు మండలంలోని జౌలా(కె) పంచాయతీ పరిధిల కల్యాణి, ఖానాపూర్ మండలం బీర్నంది పంచాయతీ పరిధి రంగపేట, కడెం మండలం ధర్మాజీపేట్ పంచాయతీ పరిధి న్యూ ధర్మాజీపేట్‌ను కొత్త పంచాయతీలుగా గుర్తించారు. ఇవే కాకుండా పలు గ్రామాలు, తండాలను పంచాయతీలుగా గుర్తించాలని ప్రజలు కోరుతున్నారు. మామడ మండలం నల్దుర్తి పరిధి వెంకటాపూర్‌ను పంచాయతీగా చేయాలన్న డిమాండ్ ఉంది.

కొత్త మండలాలకూ అవకాశం

పంచాయతీ ఎన్నికల నేపథ్యంలో ప్రభుత్వం కొత్త పంచాయతీల ఏర్పాటు, విలీనాల ప్రక్రియ చేపడుతోంది. ఇదే క్రమంలో కొత్త మండలాల ఏర్పాటు ప్రక్రియ పూర్తిచేసే అవకాశాలున్నట్లు తెలుస్తోంది. నిర్మల్ జిల్లాగా ఏర్పడి కొత్త మండలాలను ఏర్పాటు చేసిన తర్వాత కొన్నిచోట్ల తమకూ మండలం కావాలన్న డిమాండ్లు వచ్చాయి. ఖానాపూర్‌ను రెవెన్యూ డివిజన్ చేయాలన్న డిమాండ్ కూడా ఉంది. గత బీఆర్ఎస్ ప్రభుత్వం చాలా జిల్లాల్లో కొత్త మండలాలు, రెవెన్యూ డివిజన్‌లను చేసినా.. జిల్లాను మాత్రం పెద్దగా పట్టించుకోలేదు. మామడ మండలంలోని పొన్కల్ కోసం స్థానికులు ఉద్యమం లేవనెత్తడంతో సరిగ్గా అసెంబ్లీ ఎన్నికల ముందు కొత్త మండలంగా ప్రతిపాదిస్తూ ప్రభుత్వం ఉత్తర్వులిచ్చింది. ఇప్పుడు కాంగ్రెస్ ప్రభుత్వం కొత్త పంచాయతీలను ఏర్పాటు చేస్తుండటంతో మళ్లీ మండలాల లొల్లి తెరపైకి వస్తోంది.

'పొన్కల్'కు ఉత్తర్వులు..

తెలంగాణ జిల్లాల ఏర్పాటు చట్టం, 1974 (చట్టం నంబర్ 7)లోని సెక్షన్-03 సబ్‌సెక్షన్-05 కింద ప్రస్తుత మామడ మండలంలోని పొన్కల్ కేంద్రంగా కొత్త మండల ఏర్పాటును ప్రతిపాదిస్తూ గత ప్రభుత్వం ఉత్తర్వులు జారీచేసింది. ఇందులో పొన్కల్, కమల్‌కోట్, నల్దుర్తి, దేవతాపూర్, వెంకటాపూర్, బండల్ ఖానాపూర్, పోతారం, అనంతపేట్, కొత్త టెంబుర్ని, ఆదర్శనగర్ (కొత్తూరు, ఎడ్దూర్) గ్రామాలుంటాయని పేర్కొంది. పొన్కల్ కేంద్రంగా మండలం ఏర్పాటైతే ప్రస్తుత మామడ మండలకేంద్రానికి దాదాపు 15–16 కిలో మీటర్ల దూరంలోని కమల్‌కోట్, నల్దుర్తి, వెంకటపూర్ లాంటి గ్రామాలకు 'మండల' సేవలు అందుబాటులోకి వస్తాయి. అసెంబ్లీ, పార్లమెంట్ ఎన్నికలు పూర్తయి నెలలు గడుస్తున్నా.. పొన్కల్ మండల ఏర్పాటు ప్రతిపాదనపై అభ్యంతరాల స్వీకరణ వద్దే ఆగిపోయింది. త్వరలోనే ఈ ప్రక్రియకు ముందడుగు పడే అవకాశాలున్నట్లు అధికార పార్టీ నేతలు చెబుతున్నారు.

ప్రతిపాదిత మండలాలివే..

జిల్లాలో పొన్కల్‌తో పాటు గతంలో మరికొన్ని మండలాలు కావాలని ప్రభుత్వానికి ప్రతిపాదించారు. అప్పటి రాష్ట్ర ప్రభుత్వం నుంచి వచ్చిన ఆదేశాల మేరకు జిల్లా నుంచి వాటి ప్రతిపాదనలూ పంపించారు. సారంగపూర్ మండలంలోని బీరవెల్లి, లక్ష్మణచాంద మండలంలోని వద్యాల్, తానూరు మండలంలోని బెల్తరోడా కేంద్రాలుగా కొత్త మండలాలు ఏర్పాటు చేయవచ్చన్న ప్రతిపాదనలు అప్పట్లో చేశారు. స్థానిక ప్రజాప్రతినిధులు, ప్రజల వినతుల మేరకు నాలుగు మండలాల ఏర్పాటుపై సాధ్యాసాధ్యాలను పరిశీలించాలని 2019లోనే సర్కారు ఉత్తర్వులిచ్చింది. అనంతరం రాష్ట్రవ్యాప్తంగా చాలా డిమాండ్లు రావడంతో ఎంపీటీసీ స్థానాల ప్రాతిపదికన ఏర్పాటు చేస్తున్నట్లు ప్రకటించింది. తాజాగా కాంగ్రెస్ అధికారంలోకి రావడంతో మళ్లీ కొత్త మండలాల ఏర్పాటుపై స్థానికులు ఆశలు పెట్టుకుంటున్నారు.

ఏర్పాటు ప్రక్రియ పూర్తిచేయాలి



మా ఉద్యమం, నాయకులు సహకారంతో గత ప్రభుత్వం పొన్కల్‌ను మండలంగా ఏర్పాటు చేయాలని నోటిఫికేషన్ ఇచ్చింది. ప్రభుత్వం స్థానిక ప్రజల అభీష్టం మేరకు త్వరగా మండలాల ఏర్పాటు ప్రక్రియ పూర్తిచేయాలి.
– కొరిపెల్లి సుధాకర్‌రెడ్డి, పొన్కల్ జేఏసీ చైర్మన్

వెంకటాపూర్‌ను జీపీ చేయాలి



మామడ మండలంలోని నల్దుర్తి పరిధిలో ఉన్న వెంకటాపూర్‌ను గ్రామ పంచాయతీగా గుర్తించాలి. పొన్కల్ మండల ఏర్పాటుతో పాటు అన్ని అర్హతలున్న మా గ్రామాన్ని గ్రామపంచాయతీగా ఏర్పాటు చేయాలి.
– భుక్య రవి, వెంకటాపూర్, మామడ మండలం

సమస్యల పరిష్కారంలో నిర్లక్ష్యం వద్దు

- కలెక్టర్ అభిలాష అభినవ్
- ప్రజావాణిలో అర్జీల స్వీకరణ



దరఖాస్తులు స్వీకరిస్తున్న కలెక్టర్ అభిలాష అభినవ్, పక్కన అదనపు కలెక్టర్ ఫైజాన్ అహ్మద్

నిర్మల్‌టౌన్: ప్రజాసమస్యల పరిష్కారంలో నిర్లక్ష్యం వహిస్తే కఠినచర్యలు తప్పవని కలెక్టర్ అభిలాష అభినవ్ అధికారులను హెచ్చరించారు. కలెక్టరేట్‌లో సోమవారం నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో ప్రజల నుంచి దరఖాస్తులు స్వీకరించారు. సమస్యల పరిష్కారం కోసం దరఖాస్తులను ఆయా శాఖల అధికారులకు పంపించినట్లు తెలిపారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. ఈనెల 5నుంచి 9వ తేదీ వరకు నిర్వహించిన స్వచ్ఛదనం-పచ్చదనం కార్యక్రమంలో అధికారులంతా సమన్వయంతో పని చేశారని పేర్కొన్నారు. ఇదే స్ఫూర్తితో ప్రభుత్వ అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను విజయవంతం చేయాలని సూచించారు. నషా ముక్త్ భారత్ కార్యక్రమం నాలుగో సంవత్సరం పూర్తి చేసుకున్న సందర్భంగా మాదక ద్రవ్యాల రహిత సమాజానికి ప్రతి ఒక్కరూ పాటుపడాలని కోరారు. అనంతరం మాదక ద్రవ్యాలను అరికట్టేందుకు అధికారులతో కలెక్టర్ ప్రతిజ్ఞ చేయించారు. కాగా, కంటి వెలుగు కోసం పెట్టిన తమ వాహనాల లీజు డబ్బులు 12 నెలలైనా చెల్లించడంలేదని నిర్మల్‌కు చెందిన వాహన యజమానులు, డ్రైవర్లు శ్రీనివాస్, మంగల్, శంకర్, అబ్దుల్ అజీమ్, అబ్దుల్ ఖాన్, లాయక్ కలెక్టర్‌కు వినతిపత్రం అందించారు. వెంటనే చెల్లించాలని కోరారు. తన భర్త దుబాయ్‌లో గాయపడి ఇంటికి చేరిన కొద్దిరోజులకు మృతి చెందాడని, అతడికి అక్కడి కంపెనీ నుంచి రావాల్సిన బెనిఫిట్స్ ఇప్పించాలని దిలావర్‌పూర్ మండలం కాల్వ గ్రామానికి చెందిన దుండగల లక్ష్మి అర్జీ అందించింది. కార్యక్రమంలో అదనపు కలెక్టర్ ఫైజాన్ అహ్మద్, డీఆర్వో భుజంగరావు, వివిధ శాఖల జిల్లా అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

మహిళలూ.. మహరాణులు



కలెక్టరేట్ కార్యాలయం

- జిల్లాలో కీలక పోస్టుల్లో వారే
- సజావుగా సాగిస్తున్న పాలన

లక్ష్మణచాంద: ఒక జిల్లాలో కీలక పోస్టుల్లో బాస్‌లుగా ఎక్కువమంది మహిళా అధికారులు ఉండటం అరుదు. ఒక వేళ ఏదైన జిల్లాలో ఉన్నా ఏదో ఒక శాఖ, లేదంటే రెండు శాఖలకే ఉండొచ్చు. కానీ.. నిర్మల్ జిల్లాలో మాత్రం పలు కీలక పోస్టుల్లో మహిళా అధికారులే బాస్‌లుగా ఉన్నారు. జిల్లాలో అత్యంత కీలకమైన కలెక్టర్, ఎస్పీ, నిర్మల్ డీఆర్డీవో, ఆర్డీవో పోస్టుల్లో మహిళా అధికారులే బాస్‌లుగా ఉండి సజావుగా పాలన కొనసాగిస్తున్నారు. కలెక్టర్‌గా అభిలాష అభినవ్, ఎస్పీగా జానకీ షర్మిల, నిర్మల్ డీఆర్డీవోగా విజయలక్ష్మి, నిర్మల్ ఆర్డీవోగా రత్నకల్యాణి ఇలా పలు కీలక పోస్టుల్లో మహిళా అధికారులు బాస్‌లుగా ఉండి జిల్లా ప్రజలకు సుపరిపాలన అందిస్తున్నారు.

జిల్లా బాస్‌లుగా తమదైన శైలిలో..

కలెక్టర్‌గా ఇటీవలే జిల్లాకు వచ్చిన అభిలాష అభినవ్ ప్రతీ సోమవారం ప్రజావాణి నిర్వహిస్తూ బాధితుల సమస్యలు ఓపికతో తెలుసుకుంటున్నారు. వెంటవెంటనే ఆయా శాఖల అధికారుల ద్వారా పరిష్కారం చూపుతూ జిల్లాలో తనదైన ముద్ర వేసుకున్నారు. జిల్లాలో పర్యటిస్తూ సమస్యలు తెలుసుకుని పరిష్కారంలో ప్రత్యేకత చాటుకుంటున్నారు. ఎస్పీగా బాధ్యతలు చేపట్టిన జానకీ షర్మిల జిల్లాలో గంజాయి, సైబర్ నేరాలు, రోడ్డు ప్రమాదాలు, గుడుంబా నియంత్రణకు ఎప్పటికప్పుడు తగిన చర్యలు తీసుకుంటున్నారు. అనుక్షణం సిబ్బందిని అప్రమత్తం చేస్తూ జిల్లాలో శాంతిభద్రతలను పరిరక్షిస్తూ తనదైన ముద్ర వేసుకున్నారు. డీఆర్డీవో విజయలక్ష్మి జిల్లా నలుమూలల పర్యటిస్తూ వినూత్న కార్యక్రమాలు చేపడుతున్నారు. అటవీ ప్రాంతంలోని మహిళలకు పోషకాహారం అందించేందుకు పోషకాహార కిట్లు అందేలా చూస్తున్నారు. ఉపాధి కూలీలకు వందరోజుల పని కల్పిస్తున్నారు. నిర్మల్‌లో కొయ్యబొమ్మల తయారీకి వినియోగించే పునికి చెట్లను విస్తృతంగా పెంచుతూ రాష్ట్రంలోనే జిల్లాను ముందువరుసలో నిలుపుతూ ముందుకు సాగుతున్నారు.

లక్ష్మణచాంద మండలంలోనూ...

లక్ష్మణచాంద మండలంలోనూ పలు శాఖలకు మండల బాస్‌లుగా మహిళా అధికారులే ఉన్నారు. తహసీల్దార్‌గా జానకి, ఎంపీడీవోగా రాథోడ్ రాధ, ఎస్సైగా సుమలత, ఏపీవోగా ప్రమీల, ఏపీఎంగా వాణిశ్రీ, ప్రాథమిక ఆరోగ్యకేంద్రంలో మెడికల్ ఆఫీసర్‌గా ప్రత్యూష.. ఇలా మండలంలోని కీలకశాఖలకు బాస్‌లుగా మహిళా అధికారులే ఉండి మంచి పరిపాలన అందిస్తున్నారు.

స్త్రీనిధిలో జిల్లా హ్యాట్రిక్



జిల్లా కేంద్రంలో కేక్ కట్ చేస్తున్న డీఆర్డీవో, స్త్రీనిధి ఆర్ఎం, మహిళలు (ఫైల్)

- వరుసగా మూడోసారి ప్రథమస్థానం
- రేపు హైదరాబాద్‌లో అవార్డు ప్రదానం

నిర్మల్: మహిళల జనాభాలో టాప్‌లో ఉండటంతో పాటు స్త్రీసాధికారతలోనూ జిల్లా ప్రథమస్థానాన్ని నిలుపుకొంటోంది. స్త్రీనిధి రుణాల అందజేత, రికవరీలో వరుసగా మూడోసారి రాష్ట్రస్థాయిలో ప్రథమ స్థానంలో నిలిచి హ్యాట్రిక్ సాధించింది. జిల్లా టాప్‌లో ఉన్నట్లు సోమవారం స్త్రీనిధి డీజీఎం ప్రకటించారు. దీనిపై డీఆర్డీవో విజయలక్ష్మి, స్త్రీనిధి ఆర్ఎం సరిత, ఏఎంలు, సభ్యులు హర్షం వ్యక్తంజేస్తున్నారు.

లక్ష్యానికి మించి..

వరుసగా మూడేళ్లుగా స్త్రీనిధి రుణాల సద్వినియోగంతో పాటు వాటిని తిరిగి చెల్లించడంలో జిల్లా మహిళలు ఆధిక్యత చాటుకుంటున్నారు. 2023–24 ఆర్థిక సంవత్సరంలోనూ ఇదే తీరుగా సాగారు. జిల్లాలో 504మంది వీవోఏల పరిధిలో 12వేల ఎస్ఎస్‌జీలు ఉండగా, వాటిలో లక్షా 38వేల మంది మహిళలు సభ్యులుగా కొనసాగుతున్నారు. ఈ ఆర్థిక సంవత్సరం స్త్రీనిధి రుణ లక్ష్యం రూ.98కోట్లు కాగా, లక్ష్యానికి మించి ఏకంగా రూ.105కోట్ల రుణాలిచ్చారు. రికవరీ కూడా వందశాతం పూర్తిచేశారు. స్త్రీనిధితో పాటు బ్యాంక్ లింకేజీ రుణాల్లోనూ జిల్లా వరుసగా రెండుసార్లు టాప్‌లో నిలిచి అవార్డులు అందుకోవడం విశేషం. తాజాగా స్త్రీనిధి అవార్డును బుధవారం హైదరాబాద్‌లోని రాజేంద్రనగర్‌లోగల వ్యవసాయ యూనివర్సిటీలో రాష్ట్ర పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధిశాఖ మంత్రి సీతక్క చేతుల మీదుగా డీఆర్డీవో విజయలక్ష్మి, స్త్రీనిధి బృందం అందుకోనున్నారు.

సమష్టి కృషితోనే సాధ్యమైంది

జిల్లా వరుసగా మూడోసారి స్త్రీనిధిలో ప్రథమస్థానంలో నిలవడం హర్షణీయం. జిల్లా ఉన్నతాధికారుల సహకారం, అందరి సమష్టి కృషితోనే ఇది సాధ్యమైంది.
– విజయలక్ష్మి, డీఆర్డీవో

కరాటే పోటీల్లో విద్యార్థినుల ప్రతిభ

నిర్మల్ రూరల్: ఆదిలాబాద్‌లో శనివారం నిర్వహించిన జోనల్ స్థాయి బాక్సింగ్ పోటీల్లో నిర్మల్ అర్బన్ కేజీబీవీ విద్యార్థినులు ప్రతిభ కనబరిచినట్లు ఎస్వో సుజాత తెలిపారు. పాఠశాలకు చెందిన వనజ, శ్రావణి, అక్షయ, నందిని, అశ్విత, హర్షిత, మైత్రి, జ్యోత్స్న బంగారు పతకాలు సాధించగా, అనన్య రజత పతకం సాధించినట్లు పేర్కొన్నారు. వీరిని సోమవారం పాఠశాలలో ఉపాధ్యాయులు అభినందించారు. ఉపాధ్యాయులు గీతారాణి, సప్న, శ్రీదేవి, అనిత, రాణి తదితరులున్నారు.



సాధించిన పతకాలతో విద్యార్థినులు

రైతు దంపతులకు ఢిల్లీ నుంచి ఆహ్వానం



హారిక- దువ్వెందర్‌రెడ్డి దంపతులు (ఫైల్)

మామడ: మండలంలోని కొరిటికల్ గ్రామానికి చెందిన రైతు దంపతులు హారిక–దువ్వెందర్‌రెడ్డిలకు ఢిల్లీలో నిర్వహించే స్వాతంత్ర్య దినోత్సవ వేడుకల్లో పాల్గొనే అవకాశం లభించింది. ఆధునిక పద్ధతులతో డ్రోన్ ద్వారా ఎరువులను పిచికారి చేయడంతో పాటు ఇతర రైతులకు అవగాహన కల్పించినందుకు కేంద్ర ప్రభుత్వం వీరిని ఎంపిక చేసింది. సమాచారం అందడంతో వారు సోమవారం ఢిల్లీకి వెళ్లారు.

విద్యావలంటీర్లను నియమించాలి

భైంసాటౌన్: జిల్లాలో ఖాళీగా ఉన్న ఉపాధ్యాయ స్థానాల్లో విద్యావలంటీర్లను నియమించాలని తపస్ జిల్లా గౌరవాధ్యక్షుడు జీ రాజేశ్వర్ ఓ ప్రకటనలో కోరారు. ఉపాధ్యాయుల ప్రమోషన్లు, బదిలీల నేపథ్యంలో చాలా పాఠశాలల్లో టీచర్ల కొరత ఏర్పడిందని తెలిపారు. దీంతో విద్యార్థులు తరగతులు నష్టపోతున్నారని పేర్కొన్నారు. నారాయణపేట, వికారాబాద్ జిల్లాల్లో కలెక్టర్ చొరవ తీసుకుని అకాడమీ ఇన్‌స్ట్రక్టర్ల నియామకానికి ఆదేశాలిచ్చారని తెలిపారు. జిల్లాలోనూ నియమించాలని కోరారు.

బాక్సింగ్‌లో విద్యార్థులకు పతకాలు



అశ్వినిని అభినందిస్తున్న ఎస్పీ జానకీ షర్మిల



మెడల్స్‌తో విద్యార్థినులు, ఉపాధ్యాయులు

నిర్మల్‌టౌన్: సబ్ జూనియర్ స్టేట్ బాక్సింగ్ చాంపియన్‌షిప్‌లో సిల్వర్ మెడల్ సాధించిన జిల్లాకు చెందిన అశ్వినిని సోమవారం ఎస్పీ జానకీ షర్మిల తన కార్యాలయంలో అభినందించారు. తెలంగాణ బాక్సింగ్ ఫెడరేషన్ వారు నిర్వహించిన మూడో సబ్ జూనియర్ బాలబాలికల పోటీల్లో జిల్లాలో హోంగార్డ్‌గా విధులు నిర్వహిస్తున్న బత్తుల లక్ష్మి కుమార్తె అశ్విని 37–40 కేజీల విభాగంలో సిల్వర్ పతకం సాధించింది. ఈనెల 30నుంచి ఢిల్లీలో నిర్వహించనున్న జాతీయ బాక్సింగ్ పోటీల్లో పాల్గొననుంది. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ.. అశ్వినికి జిల్లా పోలీస్‌శాఖ తరఫున సహాయ, సహకారాలు అందిస్తామని తెలిపారు.

సోన్: ఆదిలాబాద్‌లో నిర్వహించిన జోనల్ స్థాయి కిక్ బాక్సింగ్ పోటీల్లో ప్రతిభ కనబరిచిన సోన్ కేజీబీవీ విద్యార్థినులు గోల్డ్, సిల్వర్ మెడల్స్‌తో సత్తా చాటారు. అండర్–14 బాలికల విభాగంలో కర్కూరి నందిని గోల్డ్ మెడల్, అండర్–17 విభాగంలో ఈరవత్రి రాజేశ్వరి సిల్వర్ మెడల్ సాధించినట్లు ప్రిన్సిపాల్ లత తెలిపారు. ఈ సందర్భంగా సోమవారం వీరిని ప్రిన్సిపాల్, ఉపాధ్యాయులు అభినందించారు.

మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలి



సిబ్బందితో ప్రతిజ్ఞ చేయిస్తున్న ఉమ్మడి జిల్లా పోస్టల్ సూపరింటెండెంట్ దేవిరెడ్డి సిద్ధార్థ

భైంసా: మత్తుపదార్థాలకు ప్రతి ఒక్కరూ దూరంగా ఉండాలని ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా పోస్టల్ సూపరింటెండెంట్ దేవిరెడ్డి సిద్ధార్థ సూచించారు. సోమవారం భైంసాలోని డాక్టర్స్ అసోసియేషన్ భవనంలో నషా ముక్త్ భారత్ అభియాన్‌లో భాగంగా పోస్టల్ సిబ్బందికి ప్రత్యేక అవగాహన కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా దేవిరెడ్డి సిద్ధార్థ మాట్లాడుతూ.. మత్తు పదార్థాల వినియోగంతో మానసిక, శారీరక, సామాజిక సమస్యలు తలెత్తుతాయని తెలిపారు. దేశభవిష్యత్‌ను కుంగదీసే మాదకద్రవ్యాలను అరికట్టాలని పిలుపునిచ్చారు. అనంతరం పోస్టల్ సిబ్బందితో ప్రతిజ్ఞ చేయించారు.

పొదుపుపై అవగాహన కల్పించాలి

గ్రామీణ ప్రాంతాల్లో అతిపెద్ద నెట్‌వర్క్‌గా ఉన్న పోస్టల్ సిబ్బంది పొదుపుపై అవగాహన కల్పించాలని, పోస్టల్ పథకాలను వివరించాలని ఎస్పీ దేవిరెడ్డి సిద్ధార్థ సూచించారు. 2023–24 సంవత్సరంలో భైంసా డివిజన్‌లో ఉత్తమ ప్రతిభ కనబరిచిన ఉద్యోగులకు జ్ఞాపికలతోపాటు ప్రశంసాపత్రాలు పంపిణీ చేశారు. కార్యక్రమంలో భైంసా సబ్‌డివిజనల్ పోస్టల్ ఇన్‌స్పెక్టర్ పీ దిలీప్‌కుమార్, ఐపీపీబీ బ్రాంచ్ మేనేజర్ కల్యాణ్, పోస్టల్ ఎంవో నరేశ్, భైంసా ఎస్పీఎం నర్సయ్య, బీపీఎంలు, ఏబీపీఎంలు, గ్రామీణ్ డాక్‌సేవక్‌లు పాల్గొన్నారు.

క్లుప్తంగా

శతాధిక వృద్ధుడు మృతి



దేవిదాస్(ఫైల్)

తాంసి: మండల కేంద్రానికి చెందిన శతాధిక వృద్ధుడు ఉపలంచి దేవిదాస్ (102) సోమవారం మధ్యాహ్నం మృతి చెందాడు. దేవి దాస్ కొంతకాలంగా అనారోగ్యంతో బాధపడుతున్నాడు. ఈ క్రమంలో ఇంటి వద్ద మృతి చెందాడు.

ఇద్దరు గంజాయి విక్రేతల అరెస్టు

నిర్మల్‌టౌన్: గంజాయి విక్రయిస్తున్న ఇద్దరు వ్యక్తులను అరెస్టు చేసినట్లు డీఎస్పీ గంగారెడ్డి తెలిపారు. సోమవారం జిల్లా కేంద్రంలోని డీఎస్పీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వివరాలు వెల్లడించారు. పట్టణంలోని సార్ధ్ మహల్‌కు చెందిన సయ్యద్ అహ్మద్ ప్లాస్టిక్ కవర్లలో గంజాయి అమ్ముతుండగా తమకు అందిన సమాచారం మేరకు ఎస్సై రమేశ్ సిబ్బందితో కలిసి వెళ్లి పట్టుకున్నారు. అతని వద్ద నుంచి 450 గ్రాముల గంజాయి స్వాధీనం చేసుకున్నారు. నిందితుడిని విచారించగా స్థానిక విశ్వనాథ్‌పేట్ కాలనీకి చెందిన అబ్దుల్ ముక్తార్ వద్ద కొనుగోలు చేసినట్లు తెలిపాడు. ముక్తార్ వద్ద నుంచి 1100 గ్రాముల గంజాయిని స్వాధీనం చేసుకున్నారు. అతన్ని విచారించగా మహారాష్ట్రలో గుర్తు తెలియని వ్యక్తి నుండి కొనుగోలు చేసినట్లు తెలిపాడు. ఇద్దరిపై కేసు నమోదు చేసి రిమాండ్‌కు తరలించినట్లు ఆయన పేర్కొన్నారు. సమావేశంలో పట్టణ సీఐ ప్రవీణ్ కుమార్, తదితరులు పాల్గొన్నారు.

మహిళ మెడలోంచి గొలుసు అపహరణ

నర్సాపూర్(జి): మండలంలోని తురాటి గ్రామానికి చెందిన గడ్డం లింగవ్వ మెడలోంచి రెండు తులాల బంగారు గొలుసు అపహరణకు గురైన సంఘటన సోమవారం చోటు చేసుకుంది. బాధితురాలు, పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం...లింగవ్వ నిర్మల్‌లో బస్సు ఎక్కి తురాటి బస్టాప్ వద్ద దిగింది. గ్రామానికి నడుచుకుంటూ వెళ్తుండగా బైక్‌పై వచ్చిన ఇద్దరు గుర్తు తెలియని వ్యక్తులు మెడలోంచి గొలుసు లాక్కెళ్లారు. గొలుసు విలువ రూ.లక్ష 40 వేలు ఉంటుందని బాధితురాలు వాపోయింది. బాధితురాలి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై హన్మాండ్లు తెలిపారు.

కుక్కల దాడిలో 2 గొర్రెలు, మేక మృతి

ఖానాపూర్: పట్టణంలోని విద్యానగర్ కాలనీకి చెందిన యుముండ్ల రాజన్న గొర్రెల పాకపై ఆదివారం రాత్రి ఊర కుక్కలు దాడి చేయడంతో రెండు గొర్రెలతో పాటు ఒక మేక మృతి చెందింది. మరో నాలుగు గొర్రెలు తీవ్రంగా గాయపడ్డాయి. రూ.50 వేల వరకు నష్ట పోయానని బాధిత రైతు వాపోయాడు. పరిహారం అందించి ఆదుకోవాలని కోరుతున్నాడు.

విద్యుదాఘాతంతో ఎద్దు మృతి

కడెం: మండలంలోని అల్లంపెల్లి గ్రామ పంచాయతీ పరిధిలోని అద్దాల తిమ్మాపూర్‌లో రహదారిపై 11కేవీ విద్యుత్ స్తంభానికి ఉన్న సపోర్టు వైరును తాకడంతో విద్యుదాఘాతానికి గురై దుక్కిటెద్దు మృతి చెందింది. ఎద్దు విలువ రూ.40 వేలు ఉంటుందని అల్లంపెల్లి గ్రామానికి చెందిన బాధిత రైతు సింగిరెడ్డి శ్రీనివాస్‌రెడ్డి వాపోయాడు. ప్రభుత్వం పరిహారం అందించి ఆదుకోవాలని కోరుతున్నాడు.

లెఫ్టా.. రైటే!





మామడ మండలంలోని పరిమండల్ జెడ్పీ పాఠశాల విద్యార్థులు

- కొందరికి పుట్టుకతోనే ఎడమచేతి వాటం..
- లెఫ్ట్ హ్యాండర్సే ప్రత్యేక ప్రతిభావంతులంటున్న నిపుణులు
- ప్రత్యేకత చాటుతున్న లెఫ్ట్ హ్యాండర్స్
- నేడు ప్రపంచ లెఫ్ట్ హ్యాండర్స్ డే

నిర్మల్‌ఖిల్లా: సాధారణంగా సమాజంలోని ప్రతీ వ్యక్తి ప్రత్యేక భిన్నమైన గుణం కలిగి ఉంటాడు. అయితే కొందరిలో వారి ప్రత్యేకతను బట్టి ఇట్టే గుర్తుపట్టొచ్చు. ప్రతీ వందమందిలో 90 మంది కుడిచేతివాటం వారు ఉండగా మిగతా 10 శాతం మందిలో చాలా లెఫ్ట్ హ్యాండర్స్ కనిపిస్తుంటారు. కుడిఎడమైతే పొరపాటు లేదోయ్.. అన్నాడో సినీ కవి.. అంటే వ్యక్తిలోని భిన్నత్వాన్ని బట్టి ఆ వ్యక్తికి ప్రత్యేకతను ఆపాదిస్తాం. ఎడమ చేతివాటం అనేది జన్యు ప్రభావ ఫలితంగా ఏర్పడిందని వైద్య పరిశోధనల్లో రుజువైంది. నేడు ప్రపంచ లెఫ్ట్ హ్యాండర్స్ డే సందర్భంగా కథనం.

భిన్నమైన శైలి...

కుడిచేతివాటం వారి కన్నా ఎడమచేతివాటం వారు ప్రత్యేక స్థానాల్లో ఉంటారని, వారి మేథోశక్తి ఆలోచనలు, తెలివితేటలు భిన్నంగా ఉంటాయని నిపుణులు అంచనా వేస్తున్నారు. ప్రస్తుతం ప్రపంచంలో గుర్తింపు పొందిన మేధావుల్లో చాలామంది ఎడమ చేతి వాటం కలిగిన వారే కావడం విశేషం. ప్రస్తుత భారత ప్రధాని నరేంద్ర మోదీ సైతం ఎడమ చేతితోనే రాస్తారు. ప్రముఖ క్రికెట్ క్రీడాకారుడు సచిన్ టెండూల్కర్, యువరాజు సింగ్, సినీ నటులు అమితాబ్ బచ్చన్, సావిత్రి లాంటివారు లెఫ్ట్ హ్యాండర్స్ వారే కావడం గమనార్హం. ఎడమచేతి వాటం వారిలో సృజనాత్మకత, సంగీతం, కళలు, అభినయం, గ్రహణశక్తి సామర్థ్యాలు, భావవ్యక్తీకరణ నైపుణ్యాలు అమితంగా ఉంటాయని పరిశోధనలు వెల్లడిస్తున్నాయి.

మాన్పించవద్దు..

ఏడాదిన్నర నుంచి రెండేళ్ల మధ్య వయసులో ఉన్నప్పటి నుండి పిల్లలు వస్తువులను పట్టుకోవడం మొదలుపెడతారు. ఈ సమయంలోనే కుడి, ఎడమ చేత వాటాలను గుర్తించవచ్చు. ఎడమ చేతి వాటాన్ని తల్లిదండ్రులు ఒక చెడు అలవాటుగా భావించి మాన్పించేందుకు ప్రయత్నం చేస్తారు. అలా చేయడం వల్ల ఇతర సమస్యలు తలెత్తుతాయని నిపుణులు హెచ్చరిస్తున్నారు. కుడి చేత్తో రోజువారి పనులు చేసుకోవడం సహజమే. అయితే ఆ పనులను ఎడమ చేత చేయడం కాస్త ఛాలెంజ్‌తో కూడుకున్నది. రోజువారీ పనులన్నీ ఎడమచేత్తో చేస్తూ ప్రత్యేకంగా పేరొందిన వారి జాబితాలో మనదేశం చాలా పెద్దది. అందులో సైంటిస్టులు, క్రీడాకారులు, తత్వవేత్తలు, వ్యాపారవేత్తలు, రాజకీయవేత్తలు చాలామంది ఉన్నారు. ప్రతి 10 మందిలో ఒకరు ఎడమ చేతివాటం ఉన్న వారేనని పరిశోధనలు స్పష్టం చేస్తున్నాయి.

జన్యు ప్రభావ ఫలితంగానే...

ప్రతీ వ్యక్తి పుట్టినప్పటి నుండే కుడి, ఎడమ చేతి వాటాలను సహజసిద్ధంగానే కలిగి ఉంటాడని సైన్స్ చెబుతోంది. ఒక మనిషికి మెదడు కుడి ఎడమ రెండు అర్ధ భాగాలుగా ఉంటుంది. కుడి వైపు శరీర భాగాన్ని మెదడు ఎడమవైపు భాగం నియంత్రిస్తుందని, కుడి అర్ధ భాగం మెదడు బలంగా ఉన్న వారిలో ఎడమ చేతి వాటం వస్తుందని నిపుణులు పేర్కొంటున్నారు. చిన్నప్పటినుండే తల్లిదండ్రులు ఎడమ చేతి వాటం గమనిస్తే మాన్పించేందుకు ప్రయత్నం చేస్తారు. జన్యుపరమైన మార్పులు ఉన్నప్పుడు అలా మాన్పించడం సాధ్యంకాదు.

ఒకే తరగతిలో ఐదుగురు...

నిర్మల్ జిల్లా మామడ మండలం పరిమండల్ గ్రామ ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో నాలుగో తరగతిలో దాదాపు 22 మంది ఉండగా అందులో ఐదుగురు ఎడమ చేతి వాటం కలిగిన వారే ఉండడం విశేషం. వీరు హోం వర్క్, పెయింటింగ్స్, రాతపని ఏది చేయాలన్నా ఎడమ చేతితోనే చేస్తారు. శ్రీకృతి, శ్రీహరి, సిద్ధార్థ, సమాధాన్, వర్షిత్ అనే పదేళ్లలోపు చిన్నారులతో పాటు మరో ముగ్గురు విద్యార్థులు ఎడమ చేతి వాటం కలిగి ఉన్నారు. వారంతా చదువు, రాత పనుల్లో చురుకుదనం కలిగి ఉన్నట్లు ఉపాధ్యాయులు పేర్కొంటున్నారు. డ్రాయింగ్, పెయింటింగ్‌లో నైపుణ్యం కలిగి ఉన్నారు.

జన్యు ప్రభావంతోనే..



గర్భస్థ దశలో శిశువు ఉన్నప్పుడు ఏర్పడిన జన్యు ప్రభావంతోనే ఎడమచేతివాటంతో జన్మిస్తారు. పుట్టినప్పటి నుండే ప్రతీపనిని ఎడమచేతితో చేసేందుకు ప్రయత్నిస్తారు రెండేళ్ల తర్వాత తల్లిదండ్రులు ఈ విషయాన్ని గ్రహించవచ్చు. దానిని మాన్పించే ప్రయత్నం చేయకూడదు. ఎడమ చేతివాటం ఉండడం వల్ల ఎలాంటి ఇబ్బందులు తలెత్తవు.

– నాలం స్వప్న, చిన్న పిల్లల వైద్య నిపుణులు, నిర్మల్


ఊహ తెలిసినప్పటి నుంచి..



నాకు ఊహ తెలిసినప్పటి నుంచి లెఫ్ట్ హ్యాండ్ తోనే రాయడం, ఇతర పనులు చేయడం అలవాటైంది. తల్లిదండ్రులు కూడా ఎడమచేతివాటాన్ని ప్రోత్సహించారు. ఇప్పటి వరకు ఎటువంటి ఇబ్బందులు తలెత్తలేదు. సహజసిద్ధంగా ఏర్పడిన ఈ అలవాటును ఇలాగే కొనసాగిస్తున్నా.

– మాకునూరి గిరిబాబు, కంప్యూటర్ ఆపరేటర్, సిర్గాపూర్

ఎడమ చేతితోనే ...



ప్రస్తుతం నేను ప్రైవేటు ఉద్యోగిగా అకౌంట్స్ పనులు నిర్వహిస్తున్నా. చిన్నప్పటినుండి ఎడమ చేతితోనే రాయడం, పనులు చేయడం అలవాటైంది. కుడి చేతి కంటే కూడా ఎడమ చేతికి చలన నైపుణ్యాలు ఎక్కువగా ఉన్నట్లు అనిపిస్తుంది. ఏ పని చేయాలన్నా సహజసిద్ధంగానే ఎడమచేయి ముందుకు వెళ్తుంది. ఏ పని మొదలెట్టినా ఎడమ చేతితోనే చేస్తాను.

– గాంధ్ల లక్ష్మణ్, ప్రైవేటు ఉద్యోగి, కౌట్ల

చట్టాలు అతిక్రమించిన వారిపై చర్యలు తీసుకోవాలి



మాట్లాడుతున్న నైతం బాలు

నార్నూర్: ఏజెన్సీ చట్టాలను అతిక్రమిస్తూ ఆదివాసీ గిరిజనుల హక్కులను కాలరాస్తున్న వారిపై చట్టపరంగా చర్యలు తీసుకోవాలని ఆదివాసీ సంక్షేమ పరిషత్ రాష్ట్ర అధ్యక్షుడు నైతం బాలు డిమాండ్ చేశారు. సోమవారం మండల కేంద్రంలోని కుమురం భీం భవన్ వద్ద ఏర్పాటు చేసిన సమావేశంలో మాట్లాడారు. మండల కేంద్రంలోని జిన్‌గూడలో ఆక్రమణకు గురైన ప్రభుత్వ భూమిని పరిశీలించినట్లు తెలిపారు. 1/59, 1/70 చట్టానికి విరుద్ధంగా కొంతమంది గిరిజనేతరులు రాత్రికి రాత్రే ప్రభుత్వ భూమి అయిన గుట్ట ప్రాంతాన్ని డోజర్ల ద్వారా తవ్వుకుని కబ్జా చేస్తున్న సంబంధిత అధికారులు పట్టించుకోకుండా నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహరించడం సరికాదన్నారు. ఆదివాసీ సంక్షేమ పరిషత్ మండల ప్రధాన కార్యదర్శి ఆర్క గోవింద్ అధికారులకు ఫోన్ చేసినా స్పందించ లేదన్నారు. తక్షణమే అక్రమ తవ్వకాలను నిలిపివేసి బాధితులపై చట్టపరంగా చర్యలు తీసుకోవాలన్నారు. ఆదివాసీ సంక్షేమ పరిషత్ జిల్లా ప్రధాన కార్యదర్శి షెడ్మాకి రామారావు, ఆసిఫాబాద్ జిల్లా అధ్యక్షుడు మడావి మనోహర్, జిల్లా గౌరవ అధ్యక్షుడు మెస్రం శేకు, మండల అధ్యక్ష, కార్యదర్శులు ఈశ్రు, అర్క గోవింద్, నాయకులు కుమ్ర జైతూ పాల్గొన్నారు.

ఉద్యానవన పాలిటెక్నిక్‌లో అడ్మిషన్లు

ఆదిలాబాద్‌టౌన్: జిల్లా కేంద్రంలోని కొండా లక్ష్మణ్ బాపూజీ తెలంగాణ ఉద్యానవన విశ్వ విద్యాలయంలోని ఉద్యానవన పాలిటెక్నిక్ డిప్లమాలో అడ్మిషన్లకు వాక్ ఇన్ అడ్మిషన్ ప్రక్రియ చేపడుతున్నట్లు కళాశాల ప్రిన్సిపాల్ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ప్రవేశాల కోసం విద్యార్థులు హార్టికల్చర్ పాలిటెక్నిక్ కళాశాలలో ఈ నెల 14 నుంచి 16వ తేదీ వరకు పదో తరగతి, కుల, ఆదాయ ఒరిజినల్ ధ్రువీకరణ పత్రాలతో హాజరు కావాలన్నారు. సీట్ వచ్చిన విద్యార్థులు వెంటనే ఫీజు చెల్లించాల్సి ఉంటుందని, 22 సంవత్సరాల లోపు ఉన్న వారు మాత్రమే అర్హులన్నారు. 6304749921 నంబరులో సంప్రదించాలని సూచించారు.

సమస్యల పరిష్కారానికి చర్యలు చేపట్టాలి

- ఐటీడీఏ ప్రాజెక్టు అధికారి ఖుష్బూ గుప్తా



అర్జీలు స్వీకరిస్తున్న పీవో ఖుష్బూ గుప్తా

ఉట్నూర్‌రూరల్: గిరిజనుల సమస్యల పరిష్కారానికి త్వరితగతిన చర్యలు చేపట్టాలని ఐటీడీఏ ప్రాజెక్టు అధికారి ఖుష్బూ గుప్తా అధికారులను ఆదేశించారు. సోమవారం ఉట్నూర్ ఐటీడీఏ కార్యాలయ సమావేశ మందిరంలో నిర్వహించిన ప్రజావాణిలో వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన ప్రజల నుంచి అర్జీలు స్వీకరించారు. ఉట్నూర్ మండలం పాత ఉట్నూర్‌కు చెందిన గేడం శశిరేఖ ఉద్యోగ అవకాశం కల్పించాలని, నార్నూర్ మండలం గంగాపూర్‌కు చెందిన చౌహాన్ బన్ని ల్యాప్‌టాప్ ఇప్పించాలని, వాంకిడి మండలం లింగూడకు చెందిన ఆత్రం రాము ఇల్లు మంజూరు చేయించాలని, మామడ మండలానికి చెందిన లక్ష్మి తమ భూమికి పట్టా చేయించాలని అర్జీలు అందజేశారు. ఇంకా పింఛన్, రెండు పడకల గదుల ఇళ్లు, స్వయం ఉపాధి పథకాల మంజూరు, వ్యవసాయం, రెవెన్యూ శాఖలకు సంబంధించిన సమస్యలు పరిష్కరించాలని దరఖాస్తులు సమర్పించారు. కార్యక్రమంలో ఏపీవో వసంత్‌రావు, జీసీసీ డీఎం రామనందన్, అదనపు వైద్యాధికారి మనోహర్, పీహెచ్‌వో సందీప్‌కుమార్, ఆర్సీవో రాజ్యలక్ష్మి, బీఈడీ కళాశాల ప్రిన్సిపాల్ మనోహర్, డీపీవో ప్రవీణ్, మేనేజర్ లింగు, అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

గుర్తుతెలియని మృతదేహం లభ్యం



గుర్తు తెలియని మృతదేహం

నిర్మల్‌రూరల్: మండలంలో ని రత్నాపూర్ కాండ్లీలో సో మవారం గుర్తు తెలియని మృతదేహం లభ్యమైనట్లు రూరల్ ఎస్సై సాయికుమా ర్ తెలిపారు. బస్సు షెల్టర్‌లో గుర్తు తెలియని వ్యక్తి (40) పడిపోయి ఉన్నట్లు గ్రామస్తులు సమాచారం ఇచ్చారన్నారు. మృతుడు తెలుపు రంగు షర్ట్, నీలిరంగు ప్యాంటు ధరించి ఉన్నాడని, భిక్షాటన చేసే వ్యక్తిగా అనుమానం వ్యక్తం చేశారు. గుర్తు పట్టిన వారు నిర్మల్‌రూరల్ పోలీస్ స్టేషన్లో సంప్రదించాలని సూచించారు.

రోడ్డు ప్రమాదంలో గుర్తు తెలియని మహిళ మృతి

ఇచ్చోడ: మండలంలోని హెచ్‌పీగ్యాస్ ఏజెన్సీస్ 44వ జాతీయ రహదారిపై సోమవారం సాయంత్రం గుర్తు తెలియని వాహనం ఢీకొన్న ఘటనలో గుర్తు తెలియని మహిళ మృతి చెందినట్లు ఎస్సై నరేష్ తెలిపారు. మృతి చెందిన మహిళ 50 నుంచి 55 ఏళ్ల మధ్య వయస్సు ఉంటుందన్నారు. కేసు నమోదు చేసి దర్యాప్తు జరుపుతున్నట్లు తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో ఇద్దరికి గాయాలు

నార్నూర్: మండల కేంద్రం నుంచి తాడిహత్నూర్ వెళ్లే రోడ్డుపై ఆదివారం రాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో ఇద్దరు బీఆర్ఎస్ నాయకులకు గాయాలయ్యాయి. బీఆర్ఎస్ పట్టణ అధ్యక్షుడు ఫిరోజ్ ఖాన్, నాయకుడు సుల్తాన్ ఖాన్ ద్విచక్ర వాహనంపై తాడిహత్నూర్ నుంచి నార్నూర్‌కు వస్తుండగా నూతనంగా నిర్మించిన వంతెన వద్ద బైక్ అదుపు తప్పి కింద పడడంతో ఇద్దరికి తీవ్ర గాయాలయ్యాయి. కుటుంబ సభ్యులకు సమాచారం అందించడంతో ముందుగా మండల కేంద్రంలోని ప్రభుత్వ ఆసుపత్రికి, అక్కడినుంచి మెరుగైన వైద్యం కోసం ఉట్నూర్ ఆస్పత్రికి తరలించారు.

వైర్లు దొంగిలించిన వ్యక్తి అరెస్టు

లక్ష్మణచాంద: బోరు మోటారు వైర్లు దొంగిలించిన వ్యక్తిని అరెస్టు చేసినట్లు సోన్ సీఐ నవీన్ కుమార్ తెలిపారు. సోమవారం మండల కేంద్రంలోని పోలీస్ స్టేషన్‌లో ఏర్పాటు చేసిన సమావేశంలో వివరాలు వెల్లడించారు. చామన్‌పెల్లికి చెందిన లోకిని వరుణ్(28)జల్సాలకు అలవాటుపడ్డాడు. ఈ నెల 10న మండలంలోని మాచాపూర్ గ్రామ శివారులో రైతులకు చెందిన 9 మోటార్ల విద్యుత్ తీగలను దొంగిలించాడు. రైతులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు దర్యాప్తు చేస్తున్న పోలీసులు సోమవారం నిందితుడిని అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించారు.

పురుగుల మందు తాగి ఆత్మహత్య

ఇంద్రవెల్లి: పురుగుల మందు తాగి ఒకరు ఆత్మహత్య చేసుకున్న సంఘటన మండలంలోని ముత్నూర్‌లో చోటు చేసుకుంది. ఎస్సై దుబ్బాక సునీల్ తెలిపిన వివరాల ప్రకారం కుమురంభీం ఆసిఫాబాద్ జిల్లా తిర్యాణి మండలంలోని మంగి గ్రామానికి చెందిన మడావి సుకుమార్ (21) కొంతకాలంగా మతిస్థిమితం కోల్పోయాడు. ఈ నెల 11న ఉట్నూర్ వెళ్తానని ఇంట్లో తల్లికి చెప్పి వెళ్లి అదేరోజు సాయంత్రం ముత్నూర్‌లోని జిల్లా పరిషత్ పాఠశాలకు వెళ్లి పురుగుల మందుతాగి తల్లికి సమాచారం అందించాడు. వెంటనే తల్లి గౌరుబాయి ముత్నూర్‌లో ఉన్న బంధువులకు ఫోన్‌చేసి విషయం చెప్పడంతో ప్రైవేటు వాహనంలో ఆదిలాబాద్‌లోని రిమ్స్‌కు తరలిస్తుండగా మార్గమధ్యలో మృతి చెందాడు. ఎస్సై సోమవారం రిమ్స్ ఆస్పత్రిని సందర్శించి మృతికి గల కారణాలు తెలుసుకున్నారు. గౌరుబాయి ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు జరుపుతున్నట్లు ఎస్సై తెలిపారు.

హత్యాయత్నం చేసిన వ్యక్తి అరెస్ట్

తాంసి: పాతకక్షలతో వ్యక్తిపై హత్యాయత్నానికి పాల్పడిన నిందితుడిని అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించినట్లు భీంపూర్ ఎస్సై కలీం తెలిపారు. భీంపూర్ మండల కేంద్రానికి చెందిన సంతోష్‌పై ఆదివారం రాత్రి అదే గ్రామానికి చెందిన సిడాం అర్జున్ పాతకక్షలతో కొడవలితో దాడి చేసి హత్యాయత్నం చేశాడు. ఘటనలో సంతోశ్‌కు గాయాలయ్యాయి. బాధితుడి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి నిందితుడిని రిమాండ్‌కు తరలించినట్లు ఎస్సై తెలిపారు.

సేవాగ్రామ్‌ను సందర్శించిన మంత్రి సీతక్క




స్టాల్‌ను పరిశీలిస్తున్న మంత్రి సీతక్క

కైలాస్‌నగర్: రాష్ట్ర పంచాయతీ రాజ్ గ్రామీణాభివృద్ధిశాఖ మంత్రి, జిల్లా ఇన్‌చార్జి మంత్రి సీతక్క సోమవారం మహాత్మా గాంధీ స్థాపించిన మహారాష్ట్రలోని సేవాగ్రామ్‌ను సందర్శించారు. ఆశ్రమంలో ఏర్పాటు చేసిన చేనేత వస్త్రాల స్టాళ్లను పరిశీలించారు. నచ్చిన పలు వస్త్రాలను కొనుగోలు చేశారు. ఆదివారం రాత్రి ఆదిలాబాద్ జిల్లా కేంద్రంలోని ప్రజాసేవభవన్‌కు చేరుకున్నారు. ఆమెకు కాంగ్రెస్ అసెంబ్లీ నియోజకవర్గ ఇన్‌చార్జి కంది శ్రీనివాసరెడ్డి ఆధ్వర్యంలో పార్టీ శ్రేణులు పుష్పగుచ్ఛాలు అందించి స్వాగతం పలికారు. రాత్రికి అక్కడే బసచేసిన మంత్రి సోమవారం ఉదయం సేవాగ్రామ్‌కు బయలుదేరి వెళ్లారు.

నాందేవ్‌ను భారత్ రప్పించాలని వినతి

ముధోల్: కువైట్‌లో ఇబ్బందులు పడుతున్న మండలంలోని రువ్వి గ్రామానికి చెందిన రాథోడ్ నాందేవ్‌ను స్వదేశానికి రప్పించాలని అతని భార్య లక్ష్మి, కుమారుడు శ్రీకాంత్ సోమవారం బాల్కొండ మాజీ ఎమ్మెల్యే, టీఎస్ఎండీసీ చైర్మన్ అనీల్, టీపీసీసీ ఎన్ఆర్ఐ సెల్ కన్వీనర్ భీంరెడ్డి, టీజేఎస్ ముధోల్ నియోజక వర్గ ఇన్‌చార్జి సర్ధార్ వినోద్‌కుమార్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో నాయకులు నరహరీగౌడ్, నరేందర్, రంజిత్, ప్రవీణ్, తదితరులు పాల్గొన్నారు.

'హిట్ అండ్ రన్' కేసులో నిందితుల అరెస్ట్



వివరాలు వెల్లడిస్తున్న సీఐ నవీన్ కుమార్

సోన్: ఇటీవల గంజాల్ టోల్ ప్లాజా సమీపంలో జరిగిన 'హిట్ అండ్ రన్' కేసులో నిందితులను అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించినట్లు సీఐ నవీన్ కుమార్, ఎస్సై గోపి తెలిపారు. మీరట్ ఉత్తరప్రదేశ్ నుండి బ్యాగుల లోడ్‌తో విజయవాడకు వెళ్తున్న జేకే లాజిస్టిక్ కంపెనీకి చెందిన కంటైనర్ డ్రైవర్ రహీస్, క్లీనర్ వశీమ్ ఖాన్ ఈనెల 9న తెల్లవారుజామున జాఫ్రపూర్ ఎక్స్‌రోడ్ వద్ద కడ్తల్ గ్రామానికి చెందిన భోగ నారాయణ (63)ను ఢీకొట్టడంతో అక్కడికక్కడే మృతి చెందాడు. గమనించిన లారీ డ్రైవర్, క్లీనర్ లారీతో సహా పరారయ్యారు. విషయం తెలుసుకున్న పోలీసులు బృందాలుగా ఏర్పడి సాంకేతిక పరిజ్ఞానం ఉపయోగించి నిందితులను అరెస్టు చేశారు.

కాంగ్రెస్ ప్రభుత్వానిది రెండు నాల్కల ధోరణి

- ఎంపీ గోడం నగేష్



మాట్లాడుతున్న ఎంపీ గోడం నగేష్

ఆదిలాబాద్: రాష్ట్రంలోని కాంగ్రెస్ ప్రభుత్వం కేంద్ర బడ్జెట్ కేటాయింపుల విషయంలో రెండు నాల్కల ధోరణి ప్రదర్శిస్తుందని ఆదిలాబాద్ ఎంపీ గోడం నగేష్ విమర్శించారు. జిల్లా కేంద్రంలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో సోమవారం ఆయన మాట్లాడారు. కేంద్ర బడ్జెట్ అన్ని వర్గాలకు పెద్దపీట వేస్తూ కేటాయింపులు జరిపిందన్నారు. ఇది సమగ్రమైన బడ్జెట్ అని మేధావులు సైతం విశ్లేషించారన్నారు. బడ్జెట్లో తెలంగాణను విస్మరించారని, రాష్ట్రం పేరు ప్రస్తావించలేదనడం విడ్డూరంగా ఉందన్నారు. శాఖల వారీగా పద్దుల కేటాయింపు జరుగుతుందని, ఈ విషయం తెలిసినప్పటికీ అనవసర విమర్శలు చేయడం సరికాదన్నారు. ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా ఉన్న సమస్యల విషయంలో కేంద్ర మంత్రులకు విన్నవించామన్నారు. ఆదిలాబాద్–పటాన్‌చెరు రైల్వేలైన్ పనులు పూర్తి కావచ్చాయన్నారు. గతంలో ఆదిలాబాద్–ఆర్మూర్ రైల్వే లైన్‌కు సంబంధించి కేంద్ర ప్రభుత్వం నిధులను కేటాయించడం జరిగిందని, గత ప్రభుత్వం 50 శాతం నిధులు కేటాయించడం విషయంలో ఒప్పందం చేసుకోకపోవడంతో ఈ రైల్వే లైన్ ఆగిందన్నారు. జిల్లాలో నిర్మించనున్న 353 బి నేషనల్ హైవేకు సంబంధించి భూసేకరణ బాధ్యత రాష్ట్ర ప్రభుత్వం చేయాల్సి ఉందని వివరించారు. సమావేశంలో బీజేపీ జిల్లా అధ్యక్షుడు పతంగే బ్రహ్మానంద్, ప్రధాన కార్యదర్శి ఆదినాథ్, జోగురవి, విజయ్, ధోని జ్యోతి, తదితరులు పాల్గొన్నారు.

ధైర్యంగా అడుగేద్దాం.. ఆనందంగా చదివేద్దాం



అవగాహన కల్పిస్తున్న స్పెషల్ ఆఫీసర్ సృజన

భైంసా: విద్యార్థులు యూనివర్సిటీలో ధైర్యంగా అడుగేసి ఆనందంగా చదవాలని స్పెషల్ ఆఫీసర్ సృజన అన్నారు. బాసర ట్రిపుల్‌ఐటీ పీయూసీ మొదటి సంవత్సరంలో చేరిన విద్యార్థులకు సోమవారం అవగాహన కార్యక్రమం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ వీసీ ప్రొఫెసర్ వెంకటరమణ ఆదేశాల మేరకు మూడు రోజులపాటు ప్రత్యేక ఓరియంటేషన్ కార్యక్రమాన్ని ఏర్పాటు చేశామన్నారు. ఆరు సంవత్సరాలు పట్టుదలతో చదివితే ఉజ్వల భవిష్యత్ మీదేనన్నారు. ఆర్జీయూకేటీ విద్యార్థులను ఉన్నతులుగా తీర్చిదిద్దే విద్యాసౌధమని కొనియాడారు. ఇక్కడ చదివిన విద్యార్థులు ప్రభుత్వ, ప్రైవేటు, ఉన్నత విద్య రంగాల్లో రాణిస్తున్నారని వివరించారు. అసోసియేట్ డీన్స్ మాట్లాడుతూ ప్రతీ విద్యార్థి తప్పనిసరిగా 75 శాతానికి పైగా హాజరు ఉండాలన్నారు. గ్రామీణ ప్రాంతాల నుంచి కొత్తగా యూనివర్సిటీలో ప్రవేశించే విద్యార్థులు భయంతో ఉండడం సహజమేనని, ఇలాంటి వారిలో భయాన్ని పోగొట్టి భరోసా కల్పించేందుకు అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నామన్నారు. ఈ కార్యక్రమంలో అసోసియేట్ డీన్స్ డాక్టర్ పావని, డాక్టర్ చంద్రశేఖర్, డాక్టర్ దత్తు, మహేష్, వివిధ విభాగాల అధిపతులు డాక్టర్ దేవరాజు, ఏ.విజయ్ కుమార్, సురేష్, డాక్టర్ రమాదేవి, చీఫ్ వార్డెన్ శ్రీధర్, అడిషనల్ చీఫ్ వార్డెన్ అనుపమ శ్రీదేవి, డాక్టర్ సుజాత, కార్యక్రమ సమన్వయకర్త గజ్జల శ్రీనివాస్, పవన్, తదితరులు పాల్గొన్నారు.

ఒక్కో బెడ్‌పై ఇద్దరికి చికిత్స





ఇటీవల కురిసిన వర్షాలతో సీజనల్ వ్యాధుల తీవ్రత పెరిగింది. దీంతో జిల్లాలోని నలుమూలల నుంచి రోగుల సంఖ్య భారీగా పెరుగుతోంది. రోగులకు సరిపడా బెడ్లు లేకపోవడంతో ఒక్కో బెడ్‌పై ఇద్దరేసి రోగులకు చికిత్స అందిస్తున్నారు. ఆదిలాబాద్ జిల్లా కేంద్రంలోని రిమ్స్ ఆస్పత్రిలో గల ఫీమేల్ (మహిళ) వార్డులో జ్వరపీడితులు చేరుతున్నారు. ఒకే బెడ్‌పై ఇద్దరు ఉండడంతో ఇబ్బందులకు గురవుతున్నారు. ఆ చిత్రాలే ఇవి.

- సాక్షి ఫొటోగ్రాఫర్, ఆదిలాబాద్